క్లుప్తంగా

థాక్రేను కలిసిన కాంగ్రెస్ నేతలు

మహబూబాబాద్ రూరల్ : టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరిని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఎల్లంపేట గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం (రామప్ప)ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ములుగు శాసనసభ్యురాలు సీతక్క, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ మురళి నాయక్ తదితరులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

గూడూరు: పెద్ద వంగర మండలం అవుతాపురం గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని వైఎస్సార్ టీపీ మండల కో ఆర్డినేటర్ బందెల అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం డాక్టర్ వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలనే నేటి పాలకులు పేర్లు మార్చి అందిస్తున్నారన్నారు. కొంతమంది గుర్తు తెలియని దుండగులు విగ్రహాన్ని కూల్చడం అవివేకమన్నారు. ప్రభుత్వం విగ్రహాన్ని కూల్చిన వ్యక్తులను గుర్తించి, వెంటనే కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

బొడ్రాయి లెక్కలు చూపాలి

కేసముద్రం: కేసముద్రం విలేజిలో ఇటీవల చేపట్టిన బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించిన ఖర్చుల లెక్కలను ప్రజలకు చూపాలని వార్డు సభ్యుడు తుంపిళ్ల వెంకన్న గురువారం ఒక ప్రకటనలో కోరారు. పండుగకు అయిన ఖర్చుల వివరాలను బొడ్రాయి కమిటీ చూపకపోవడం సరికాదన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

డోర్నకల్: గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) నిర్వహించే ధర్నా, నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మరిపెడ రూరల్: కేంద్రంలోని అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ వంట గ్యాస్ ధరలు పెంపుపై నిరసనగా నేడు మరిపెడ ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదుట డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామసహాయం సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కొమ్మలమ్మకు ఎమ్మెల్యే పూజలు



కొత్తగూడ: మండలంలోని ఎంచగూడెం గ్రామంలో జరిగే కొమ్మలమ్మ జాతరలో ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క గురువారం రాత్రి పూజలు నిర్వహించారు. సీతక్కను ఆదివాసీ పూజారులు సంప్రదాయ బద్ధంగా ఆహ్వానించారు. అమ్మవారి కత్తి, ఇతర వస్తువులను ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రతీ ఏడాది జరిగే ఆదివాసీ జాతరలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఆ కులాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



కొత్తగూడ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ చేసిన తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల జాక్ చేపట్టిన పాదయాత్ర కొత్తగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీసీ కులాల్లో ఉన్న 11 కులాలను ఎస్టీ జాబితాలో కలపడంతో ఆదిమ తెగలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, నరేష్, శివకుమార్, సుధీర్, భాస్కర్ పాల్గొన్నారు.

గంగారంలో..

గంగారం: ఎస్టీ జాబితాలో 11 బీసీ కులాలను కలపొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, భాస్కర్‌లు అన్నారు. గంగారం మండలంలోని గంగమ్మ గుడి దగ్గర నుంచి కొత్తగూడ మండల కేంద్రంలోని కొమురంభీం విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, దొరపపటేళ్ల సంఘం, నిరుద్యోగ జాక్ నాయకులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సందీప్



తొర్రూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



పెద్దవంగరలో



గార్లలో..

పేదల జీవితాలతో చెలగాటం

కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచి అంబానీ అదానీలకు రెడ్ కార్పెట్ వేస్తుందని సీపీఐ, సీపీఎం, పీడీఎస్ యూ, పీ వైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు ఆరోపించారు. గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలన్నారు. లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



నెహ్రూసెంటర్: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



కేసముద్రం: సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్



కురవి: రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు



బయ్యారంలో..



నెహ్రూసెంటర్: సీపీఎం ఆధ్వర్యంలో..

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈ నెల 4న కురవి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులకు బస్ పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జె.విజయ్ గురువారం తెలిపారు. దివ్యాంగులు రాయితీతో కూడిన బస్సు పాస్‌లను పొందుటకు సదరం కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, అంగవైకల్యం కలిగిన ఫొటో, ఐడీ కార్డు కోసం రూ.50 తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని కురవి మండలంలో ఉన్న దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వయం పాలన దినోత్సవం



కేసముద్రం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు హాజరై తోటి పిల్లలకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రమీల, ఎస్ఎంసీ చైర్మన్ గుగులోత్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థుల జాబితా విడుదల

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ పోస్టులకు (డీఈఐసీ) దరఖాస్తులను తీసుకొని స్క్రుటినీ చేసి వెబ్‌సైట్‌లో పొందపరచడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.హరీష్ రాజ్ గురువారం తెలిపారు. 12 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల వివరాలను ఫైనల్ లిస్టును మహబూబాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్ లో పొందపరచడం జరిగిందని, అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 3వ తేదీ నుంచి 4 తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆడపిల్లలను వేధిస్తే జైలుకే

మహబూబాబాద్ రూరల్ : ఆకతాయిలు ఆడపిల్లలను వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా షీ టీం, భరోసా సెంటర్ ఇన్‌చార్జ్ సీఐ గంధ్రాతి మోహన్ అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు చైతన్య సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. బాల్యవివాహాలు చేస్తే 1098 నంబరుకు కాల్ చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో కురవి ఎస్సై బి.రాము నాయక్, ఆర్ఎస్ఐ సునంద, ఏఎస్ఐ సదయ్య, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మోహన్

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పంజాల యాకసాయిలు అన్నారు. మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామపంచాయతీ పరిధిలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గురువారం ప్రారంభించారు. గ్రామంలోని 18 సంవత్సరాలు పైబడినవారు అందరూ కళ్లకు సంబంధించి ఏ సమస్యలు ఉన్న వైద్యులకు చూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొండపల్లి రామచంద్రమ్మ, వార్డు సభ్యులు కొమ్మరాజుల సంజీవ, అలకుంట్ల వీరన్న, సెక్రటరీ గవిని మహేష్, డాక్టర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

నెల్లికుదురులో..

నెల్లికుదురు: కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదలకు వరలాంటిదని సర్పంచ్ బొమ్మెర అశోక్ అన్నారు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిని అనిల్ గౌడ్, సొసైటీ చైర్మన్ దేవేందర్‌రావు వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సొసైటీ గోదాంలో చోరీ

కేసముద్రం: మండల కేంద్రంలోని ధనసరి పీఏసీఎస్‌కి సంబంధించిన ఎరువుల గోదాంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.1.20లక్షలు అపహరించారు. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ధనసరి సొసైటీకి సంబంధించిన భవనంలో ఎరువులను విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఎరువులను అమ్మగా వచ్చిన నగదును కౌంటర్‌లో పెట్టి నిర్వాహకులు తాళం వేసుకుని వెళ్లారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు భవనం వెనుక వైపు ఉన్న తలుపులను పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. ఈ ఘటన స్థలాన్ని గురువారం పోలీసులు పరిశీలించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

అత్తకు తలకొరివి పెట్టిన అల్లుడు

కురవి: అనారోగ్యంతో మృతి చెందిన అత్తకు అల్లుడు తలకొరివి పెట్టిన సంఘటన కురవి మండల కేంద్రంలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. టీయుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ అమ్మమ్మ కొడవటి కంటి చిలకమ్మ(90) బుధవారం మృతి చెందింది. చిలుకమ్మకు ఒక కుమార్తె లక్ష్మీ ఉంది, కాగా మృతురాలి అల్లుడు చిత్తనూరి మల్లయ్య గురువారం తలకొరివి పెట్టి రుణం తీర్చుకున్నాడు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, కురవి జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆటో బోల్తా, ముగ్గురికి గాయాలు

డోర్నకల్: పాతడోర్నకల్‌లో గురువారం ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచకు చెందిన కొంత మంది గొల్లచర్లలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరయ్యేందుకు డోర్నకల్ మీదుగా గొల్లచర్లకు వెళ్తున్న క్రమంలో పాత డోర్నకల్‌లోని గండి సత్యనారాయణ రైస్‌మిల్ మూలమలుపు వద్ద పంది అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పాల్వంచకు చెందిన సౌజన్యతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నాటు సారా స్వాధీనం

తొర్రూరు/తొర్రూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు నిర్వహించిన దాడుల్లో నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. గురువారం మండలంలోని చెర్లపాలెం, చీకటాయపాలెం, ఫత్తేపురం గ్రామాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో 50 లీటర్ల మేర నాటు సారా స్వాధీనం చేసుకుని 10 మందిపై కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : అక్రమంగా తమ భూమిలోకి ప్రవేశించి ఆ భూమి తనదేనని బెదిరింపులకు పాల్పడుతున్న బోడ రాంబాబు అనే వ్యక్తిపై భూమి యజమాని డాక్టర్ పాల్వాయి సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

సర్పంచ్‌పై అత్యాచారయత్నం కేసు..

మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్ తండా సర్పంచ్ ఇస్లావత్ నరేష్ పై ఆ గ్రామ ఉప సర్పంచ్ రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేశామని కురవి ఎస్సై బీ.రాము గురువారం తెలిపారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి సర్పంచ్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

నర్సింహులపేట: మండలంలోని జయపురం, వంతడపల గ్రామాల్లో గురువారం తొర్రూర్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేయగా 24 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై ..

గార్ల: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏకకాలంలో 35 మంది విద్యుత్ సిబ్బంది ఇళ్లపై దాడులు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు విద్యుత్ ఏఈ మహేంద్ర బాబు గురువారం వెల్లడించారు. పెండింగ్ బిల్లులు రూ.2 లక్షలు వసూలైనట్లు పేర్కొన్నారు.

నలుగురికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి నలుగురు బాలురకు గురువారం గాయాలు అయ్యాయి. ఒకే వాహనంపై గూడూరు మండలం వైపునకు వెళ్తున్నారు. కంబాలపల్లి గ్రామం మీదుగా ఆ వాహనం వెళ్తున్న క్రమంలో స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి పల్టీ కొట్టి పడిపోయింది. ఈ సంఘటనలో ఆ నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సామూహిక కుంకుమార్చన



డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా గురువారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామ బలిహరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులోని 8 ప్రాంతాల్లో బైరవ కొర్రుల పతిష్ఠ, అష్టదిక్పాలక బలి కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ప్రతిష్ఠా విగ్రహాలపై జలాధివాస కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నెహ్రూసెంటర్: మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా కేంద్రంలోని వీఆర్ఎన్ గార్డెన్ లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై బోధించారు. జాతికి అంకితం చేసిన ఆస్తులను కార్పొరేట్లకు అమ్ముకుంటున్న ప్రధాని మోదీకి దేశాన్ని పాలించే హక్కు లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీని గద్దె దించే వరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు లేక యువత పక్కదారి పడుతున్నటువంటి పరిస్థితిలో ఐదేళ్లలో కార్పొరేట్లకు భారీ మొత్తంలో రుణాలు మాఫీ చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రస్తుత సమకాలిన రాజకీయ పరిస్థితులపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సుర్ణపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, గాడిపెల్లి ప్రమీల, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పాలబిందెల మల్లయ్య, రావుల రాజు, చీపిరి యాకయ్య, హేమా నాయక్, చాగంటి భాగ్యమ్మ, సుర్ణపు సావిత్రి, గొని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.నాగయ్య

సంక్షిప్తం

సమన్వయంతో పనిచేయాలి

పెద్దవంగర: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలోని రైతు వేదికలో యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎం.రమేష్, రైతు కో–ఆర్డినేటర్ బస్వశ్రీనివాస్, సర్పంచ్ జంగిలి హరిప్రసాద్‌పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: వ్యవసాయ, అనుబంధ సేవలపై అశ్వారావుపేట వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు గురువారం బయ్యారంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, తెగుళ్లు, పురుగుమందు, నీటిపారుదల, మార్కెటింగ్, పంటకోత అనంతరం కార్యకలాపాలపై సేకరించిన సమాచారాన్ని రైతులకు వివరించారు.

నగదు అందజేత

గార్ల: గార్ల మెయిన్ బజారులో గుర్తుతెలియని వ్యక్తి నగదు రోడ్డుపై పడిపోవడంతో గమనించిన గంగావత్ అరుణ్ ఆ నగదును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ మండల అధ్యక్షుడు సనికినేని శ్రీనివాస్ కోరారు. గురువారం మండల ప రిషత్ సమావేశ మందిరంలో వీఓఏల సంఘం నాయకులు డీఆర్‌డీఓ సన్యాసయ్య, అడిషనల్ డీఆర్‌డీఓ డాక్టర్ సట్ల వెంకటేలకు వినతిపత్రం సమర్పించారు.

చెస్ పోటీల్లో ప్రతిభ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గాయత్రి ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ఓపెన్ చెస్ టోర్నమెంట్లో అత్యంత ప్రతిభ కనపరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలలిత తెలిపారు.

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల ఆర్గనైజింగ్ మెంబర్‌గా సత్యనారాయణ



మహబూబాబాద్: వచ్చే నెల 9, 10 తేదీల్లో తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితి బ్రహ్మోత్సవాల కార్యక్రమం ఆర్గనైజింగ్ సెక్రటరీగా జిల్లా కేంద్రానికి చెందిన మానుకోట జిల్లా రచయిత సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రపు సత్యనారాయణకు అవకాశం కల్పించినట్లు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడబ్ల్యూజేఏ జిల్లా కమిటీలో చోటు

మరిపెడ రూరల్: ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) మహబూబాబాద్ జిల్లాలో కమిటీలో మరిపెడ మండలం నుంచి నూతనంగా ముగ్గురికి అవకాశం కల్పించినట్లు ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు లావుడియా రామునాయక్, ప్రధాన కార్యదర్శి బానోతు లక్ష్మణ్‌నాయక్‌లు గురువారం తెలిపారు.

కరాటేలో విద్యార్థులకు శిక్షణ

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామ జెడ్పీ హెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులకు కరాటేపై శిక్షణ తరగుతులు ప్రారంభించినట్లు హెచ్ఎం పద్మ తెలిపారు.

టెన్త్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలి

కురవి: ఈనెల 9, 10వ తేదీల్లో నేరడ మోడల్ స్కూల్, కురవి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించబోయే టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పట్ల మధు తెలిపారు.

ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి

గార్ల: పాకాల ఏటికి ఎస్సారెస్పీ కెనాల్ నీటిని విడుదల చేయాలని గురువారం గార్ల మండల రైతులు ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, రైతులు ఉన్నారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి

దంతాలపల్లి: ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

కంటి వెలుగుకు విశేష స్పందన

తొర్రూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని తొర్రూరు డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

దంతాలపల్లి: ప్రపంచ మేధావి డాక్టర్ అంబేడ్కర్ అని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు నూకల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని బిరిశెట్టిగూడెం గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ నిర్వహించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామానికి చెందిన రామనబోయిన రాజు తన తల్లిదండ్రులు వెంకన్న, ప్రమీల జ్ఞాపకార్థం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కురవి: సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలలో కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు.

మహిళలు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి

కురవి: మహిళలు అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గుజ్జు కృష్ణవేణి అన్నారు.

బహిరంగ చర్చకు రావాలి

నెల్లికుదురు: పనులు చేయకుండానే నిధులు కాజేశారని ఆరోపణలు చేసిన బహిరంగ చర్చకు రావాలని వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ అన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ఎం. శివాజీచౌహాన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా గ్రామాల్లో అంతర్గత రహదారులకు సీసీ రోడ్లు నిర్మిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగావత్ రుక్మిణి హరికిషన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కోరం కళ శేషయ్య, గంగావత్ భీక్యా, అన సూర్య, జి అశోక్, కిషన్‌నాయక్, జి హచ్యా, మాన్‌సింగ్ పాల్గొన్నారు.